క్లుప్తంగా

పాదచారులకు మజ్జిగ పంపిణీ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ద్వారా అందిస్తున్న చల్లని మజ్జిగ భక్తులతో పాటు పాదచారులు, గ్రామస్తులు దాహార్తిని తీర్చుతుందని ప్రజలు సంతోషం వ్యక్తంచేశారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి దీనిద్వారా చల్లని మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఆనాటి నుంచి ప్రతిరోజూ వందల మంది దాహార్తిని తీర్చుతున్న స్వామివారిని తరించుకుంటున్నారు.

ఏపీజీఈఏ చల్లపల్లి నూతన యూనిట్ ఎన్నిక



చల్లపల్లి: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీజీఈఏ) చల్లపల్లి నూతన యూనిట్‌ను ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎలక్షన్ అధికారి కొండా కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ ఎన్నికల్లో యూనిట్ అధ్యక్షుడిగా తలుపుల శ్రవణ కుమార్, జనరల్ సెక్రటరీగా పసుమర్తి నాగప్రసన్నలక్ష్మీ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా గవరాజు సాయిసింధు, ట్రెజరర్‌గా పుట్టి యోచిత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మోపిదేవి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంటులుగా షేక్ అతావుల్లా, గుంటూరు నరేష్, మహ్మద్ ఫైజాన్, పీతా ఓంకార్, సెక్రటరీలుగా ఆకుల పాండురంగారావు, నడకుదిటి దాదా, సయ్యద్ షుకార్, చిమటా గోపి ఎన్నికయ్యారు.

పశువుల నీటి తొట్టె ప్రారంభం




కోడూరు: వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన పశువుల నీటి తొట్టెను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం ప్రారంభించారు. మండలంలోని తీరప్రాంత గ్రామమైన హంసలదీవిలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.38,450తో ఈ నీటి తొట్టెను నిర్మించారు. మూగజీవాలు దాహార్తి తీర్చేందుకు వీలుగా వీటి నిర్మాణం జరిగిందని, పంచాయతీ అధికారులు వీటిపై పర్యవేక్షణ జరిపి తొట్టెలో నీటిని నింపాలని బుద్ధప్రసాద్ సూచించారు. అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, నీటి సంఘం అధ్యక్షుడు యిజ్జినేని శివాజీ పశు వైద్యాధికారి ఎండీ షఫీ, ఏపీఎం రవికుమార్,నేతలు పాల్గొన్నారు

నేడు గంగాభవానీ అమ్మవారి నెల సంబరం



కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న గంగా భవానీ అమ్మవారి నెల సంబరాన్ని మంగళవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు సోమవారం తెలిపారు. అమ్మవారి ప్రధాన జాతర పూర్తయి నెల రోజుల గడిచిన సందర్భంగా అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం నెల జాతరను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం గణపతి పూజ, మండపారాధన, అఖండస్థాపన, కుంకుమ పూజ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం పోతురాజు సంబరం, మహిళలచే నైవేద్యాల సమర్పణ ఉంటుందన్నారు. రాత్రి ఆలయ గుడి సంబరాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. జాతరను పురస్కరించుకొని ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు తలెత్తకుండా క్యూలైన్లు, టెంట్లను ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



మచిలీపట్నంటౌన్: నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోరుతూ మచిలీపట్నం డిపో పరిధిలో ఆ సంఘ నాయకులు సోమవారం బస్టాండ్ వద్ద రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఆ సంఘ కృష్ణా జిల్లా కార్యదర్శి కేవీ రావు, జిల్లా చైర్మన్ వడ్డీ నాంచారయ్య ఆధ్వర్యంలో ఈ రిలే నిరాహార దీక్షల శిబిరం ప్రారంభించారు. దీక్షలో ఏ హుస్సేన్ డెప్యూటీ మెకానిక్, ఎస్.పున్నయ్య హెల్పర్, ఎస్వీ ముఖర్జీ డ్రైవర్, పీవీ రావు, నాని కండక్టర్, ఎంఆర్ఎం రావు కండక్టరులు కూర్చున్నారు.

సైట్ ఓపెన్ కాలేదు..

రెండు రోజులాగి రండి



గురువిందగుంట గ్రామ సచివాలయం

- నిరుపేదలను వెనక్కి తిప్పి పంపిస్తున్న సచివాలయ ఉద్యోగులు
- అర్హులుంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్న అధికారులు
- సచివాలయ సిబ్బంది, వీఆర్వోలపై తహసీల్దారు సీరియస్

పెడన: సొంత ఇంటి స్థలం లేని నిరుపేదలుంటే వార్డు, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్థాయిలో కలెక్టర్, మండల స్థాయిలో తహసీల్దార్లు పత్రికాముఖంగా ప్రకటనలు జారీ చేశారు. ఇక్కడి వరకు పరిస్థితి బాగానే ఉంది. దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించడం లేదనే చందాన నిరుపేదలు పట్టణాల్లోని వార్డు సచివాలయాలకు, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయాలకు వెళ్తుంటే ఇళ్ల సైట్ ఇంకా ఓపెన్ కాలేదు, రెండు రోజులు ఆగి రావాలని తిప్పి పంపిచేస్తున్నారు. కనీసం సైట్ ఓపెన్ చేసి చూసే తీరుబడి కూడా వారికి ఉండటం లేదు. ఉన్నతాధికారులు ఇళ్ల స్థలాలు కోసం దరఖాస్తు చేసుకోమన్నారే, సైట్ ఓపెన్ అయి ఉంటుందనే పరిజ్ఞానం కూడా లేకుండా కుండబద్దలు కొట్టినట్లుగా సైట్ ఓపెన్ కాలేదు. కాగానే కబురు చేస్తామంటూ పేర్కొవడం విశేషం. కబురు చేస్తామని చెప్పడం వీరు స్వయంగా వెళ్లనూ లేరు, గతంలో వలే వలంటీర్ల ద్వారా సమాచారం చెప్పి పంపించనూ లేదు. కారణం వలంటీరు వ్యవస్థ లేదు. నిరుపేదలతో ఆటలాడుకుంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొన్ని చోట్ల ఆన్‌లైన్ చేయకుండా నిరుపేదల నుంచి కాగితాలు తీసేసుకుని మేం ఆన్‌లైన్ చేస్తామంటున్నారు. ఇంటి స్థలం వస్తుందని గ్యారంటీగా చెప్పలేమని కూడా పేర్కొవడం విశేషం. సచివాలయ ఉద్యోగులు ఈ విధంగా పేర్కొవడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వీరు అస్సలు ఆన్‌లైన్ చేస్తారా లేక చెత్తబుట్టలో వేస్తారా అనే అనుమానాలు వినిపిస్తున్నాయి. స్థలం వస్తే వస్తుంది లేకపోతే రాదని చెప్పడానికి సచివాలయ ఉద్యోగులు సరిపోతారా అనే అనుమానాలు కూడా వస్తున్నాయి. వీరి చేతుల్లో పని అన్నట్లుగా నడుచుకోవడంపై ఉన్నతాధికారులు స్పందించాలని నిరుపేదలు కోరుతున్నారు.

సచివాలయాల్లో డీఏలు...వీఆర్వోలదే కీలక పాత్ర...

నిరుపేదలు సచివాలయానికి వెళ్లి ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేయాలంటే ఆ సచివాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌ది కీలక పాత్ర. నిరుపేదలకు చెందిన ఆధార్, రైస్ కార్డు, నామినీ ఆధార్ జిరాక్స్ లేదా ఒరిజినల్స్‌ను ఆన్‌లైన్ చేయాలి. వీటితో పాటు ఒక ఫొటో తప్పనిసరిగా ఉండాలి. వీటన్నింటినీ ఆన్‌లైన్ చేసి వీఆర్వో లాగిన్‌కు పంపించాలి. వీఆర్వో నిజమైన అర్హురాలేనా లేదా అని విచారణ చేసిన తహసీల్దారు లాగిన్‌కు పంపించాలి. ఈ తంతు పూర్తి చేయాల్సి ఉంది. అయితే వీఆర్వోలు సచివాలయ ఉద్యోగులకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదనే వాదన కూడా వినిపిస్తోంది. ఇంటి స్థలాలకు సంబంధించిన సైట్ ఓపెన్ అయిన విషయాన్ని తహసీల్దారు ద్వారా వీఆర్వోలు తెలుసుకుని ఆ సమాచారాన్ని డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు చెప్పాలి. కానీ వీఆర్వోలు ఆ దిశగా స్పందించడం లేదని సమాచారం.

సిబ్బందిపై తహసీల్దారు సీరియస్...



ఇళ్ల స్థలాలు కోసం దరఖాస్తులు చేసుకోవడానికి సచివాలయాలకు వస్తున్న నిరుపేదలకు వెనక్కు తిప్పి పంపించేస్తున్న విషయాన్ని సాక్షి తహసీల్దారు కె. అనిల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లింది. అప్పటికప్పుడు ఆయన వీఆర్వోలందరికీ మెసెజ్ పాస్ చేశారు. ప్రతి వార్డు, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి హౌస్ సైట్ ఓపెన్ చేశారని, నిరుపేదలు ఎవరైనా వస్తే ఆ దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలనే విషయాన్ని తెలియజేయాలన్నారు. దరఖాస్తు చేయడానికి వచ్చే వారిని వెనక్కుతిప్పి పంపించవద్దని ఆదేశించారు. ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకునేలా సచివాలయం సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయంలోని డేటా ఎంట్రీ ఆపరేటర్లు కూడా హౌస్ సైట్ ఓపెన్ చేసి ఏమైనా సందేహాలుంటే తనను సంప్రదించాలని సూచించారు.

మద్యం షాపుతో ఇబ్బందులు పడుతున్నాం

హోంమంత్రికి మహిళల ఫిర్యాదు



హోంమంత్రి అనితకు సమస్యను వివరిస్తున్న మహిళలు

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు మండలం పోతేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మద్యం షాపు కారణంగా తాము ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోయారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు మహిళలు తమ సమస్యను విన్నవించారు. ఇటీవల గీత కార్మికులకు కేటాయించిన షాపును గ్రామంలోని ఇళ్ల మధ్య శక్తి వైన్స్ పేరుతో ఏర్పాటు చేశారన్నారు. ప్రతిరోజు మద్యం సేవించే వారు తమ ఇళ్ల ముందు ఖాళీ సీసాలు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై హోంమంత్రి అనిత మాట్లాడుతూ ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ డీకే బాలాజీకి ఆమె సూచించారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందిపుచ్చుకోవాలి

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కోడూరు: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలను విద్యార్థులు అందిపుచ్చుకొని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మండలంలోని పాలకాయతిప్ప ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తీర గ్రామాల విద్యార్థులు ప్రతిభతో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యస్థాన కోసం కష్టపడి చదవాలన్నారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు చేసిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, సర్పంచ్ కొక్కిలిగడ్డ భిక్షాలు, నీటి సంఘం అధ్యక్షుడు యిజ్జినేని శివాజీ, కేఆర్ ఇండస్ట్రీ అధినేత డి.రమేష్, ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ లంకే గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రుణాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు

టీడీపీ నాయకులపై ఫిర్యాదు చేసిన డ్వాక్రా సంఘ సభ్యులు



హోంమంత్రి అనిత కు ఫిర్యాదు చేసిన డ్వాక్రా సంఘ సభ్యులు

చిలకలపూడి(మచిలీపట్నం): సకాలంలో రుణాలు చెల్లిస్తున్నప్పటికీ తమకు రుణాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని డ్వాక్రా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు ఇచ్చేందుకు బందరు మండలం గుండుపాలెంలోని డ్వాక్రా సంఘాల సభ్యులు విచ్చేశారు. అయితే అదే సమయంలో హోంమంత్రి వంగలపూడి అనిత రావటంతో తమ గోడును ఆమెకు విన్నవించారు. గ్రామంలో ఇప్పటి వరకు నిమ్మగడ్డ సుధ బుక్ కీపర్‌గా పని చేస్తూ తమకు రుణాలు అందించి సకాలంలో చెల్లించేలా ఎన్నో సంవత్సరాలుగా చర్యలు తీసుకున్నారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆమెను అర్థాంతరంగా తొలగించి రోహిణి అనే ఆమెను బుక్‌కీపర్‌గా నియమించి గ్రామంలో ఉన్న సుమారు 20 డ్వాక్రా గ్రూపు సంఘాల సభ్యులకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వీరమాచనేని నరసింహారావు, మైనేని రాజేంద్ర లు అడ్డుకుంటున్నారన్నారు. సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ తమకు రుణాలు రాకుండా అడ్డుకోవటం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని హోంమంత్రి అనితకు వారు వివరించటంతో ఈ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ డీకే బాలాజీకి ఆమె సూచించారు.

పది, ఇంటర్ విద్యార్థులకు సన్మానం

అవనిగడ్డ: ఇటీవల వెలువడిన ఫలితాల్లో ప్రతిభ చూపిన పదో తరగతి, ఇంటర్ విద్యార్థులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సత్కరించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 26 మంది విద్యార్థులను ఆయన సత్కరించి సర్టిఫికెట్లు, మెమొంటోలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే ఒరవడి కొనసాగిస్తూ బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

కూటమి సమావేశంకు టీడీపీని దూరం పెట్టిన ఎమ్మెల్యే

అవనిగడ్డ: నియోజకవర్గంలో జనసేన, టీడీపీ మధ్య మరింత అగాధం పెరుగుతుంది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమరావతి పర్యటనను పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంకు టీడీపీ నాయకులను దూరం పెట్టారు. ఇటీవల చల్లపల్లిలో జరిగిన టీడీపీ సమావేశంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆయన కుమారుడు, అల్లుడుపై టీడీపీ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం జరిగిన ప్రత్యేక సమావేశానికి జనసేన, బీజేపీ నాయకులను ఆహ్వానించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ టీడీపీ నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఎమ్మెల్యేకి ముఖ్యమైన వ్యక్తిగా గుర్తింపు పొందిన టీడీపీ నాయకుడు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావుకు పిలుపు లేదు. టీడీపీ నాయకులను పిలవకుండా సమావేశం ఏర్పాటు చేయడంపై తెలుగు తమ్ముళ్ళు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ నుంచి జనసేనలోకి వెళ్లిన బుద్ధప్రసాద్‌ని పొత్తుధర్మం పాటించి గెలిపిస్తే తీవ్రంగా అవమానిస్తున్నారని కొంతమంది టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి పొత్తుధర్మం పాటించడం లేదని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌పై కొంతమంది నేతలు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంతో టీడీపీ, జనసేన మధ్య మరింత దూరం పెరిగినట్టయింది.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

ఏపీడీ నాగసురేష్

కృత్తివెన్ను: పర్యావరణ సమతుల్యత కాపాడాలంటే ప్రతి గ్రామంలోనూ మొక్కలను విరివిగా పెంచాలని ఉపాధి హామీ మచిలీపట్నం క్లస్టర్ ఏపీడీ నాగసురేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యానశాఖ, అగ్రికల్చరల్, ఉపాధిహామీ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హార్టీకల్చరల్ ప్రాజెక్టులో భాగంగా ఉపాధి హామీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మామిడి, వేప, జామ తదితర మొక్కల పెంపకానికి రైతులను గుర్తించాలన్నారు. మొక్కలతో పాటు వాటి సంరక్షణకు కూడా పథకం ద్వారా సాయం అందుతుందని చెప్పారు. దీంతో రైతులకు ఆర్థిక చేయూత లభిస్తుందన్నారు. మండల వ్యాప్తంగా కనీసం 70 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో ఉద్యానవనశాఖాధికారి మానస, ఏవో జెన్నీ, ఏపీవో సైదారావు, ఎన్ఆర్ఈజీఎస్ ఎఫ్ఏలు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం



బంటుమిల్లి: మండల పరిధిలోని అర్తమూరు, మల్లేశ్వరం గ్రామాల్లో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని సోమవారం రూ. 6 వేలు జరిమానా విధించినట్లు ఇన్‌చార్జి తాహసీల్దార్ కె.పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ గ్రామాల్లో రాత్రి సమయాల్లో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం రాత్రి పోలీసుల సహకారంతో దాడులు చేసి నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తరలించామన్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లకు ఒక్కొక్కదానికి రూ. 15 వందల రూపాయల జరిమానా విధించి చలానా కట్టించామని చెప్పారు. మండలంలో అనుమతులు లేకుండా మట్టి తరిలించినట్లు సమాచారం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బందరుకోట రామాలయంలో మంత్రుల పూజలు

మచిలీపట్నంటౌన్: నగర పరిధిలోని బందరుకోటలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామాలయాన్ని రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, కొల్లు రవీంద్రలు సోమవారం సందర్శించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులకు ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు, వేదాశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో మంత్రులతో పాటు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మారిటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంగా మధుసూదనరావు

గూడూరు: కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీపీ సంగా మధుసూదనరావు కోరారు. గూడూరు పీఏసీఎస్ ఆవరణలోని రైతు కల్యాణ మండపంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట జయవర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మధుసూదనరావు మాట్లాడారు. కొత్తగా నియమిస్తున్న మండల కమిటీలో అన్ని వర్గాలకు సమప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా అన్ని గ్రామాలకు ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు మాట్లాడుతూ సమష్టి కృషి తోనే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిచ్చుక గంగాధరరావు, పార్టీ జిల్లా కార్యదర్శులు లంకా సుబ్రహ్మణ్యం, పిండి వెంకన్న, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పర్ణం పెదబాబు, కారుమంచి కామేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వాసవిలో పాలిసెట్ ప్రవేశ నమూనా పరీక్ష



వాసవిలో పాలిసెట్ నమూనా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం పాలిసెట్ ప్రవేశ నమూనా పరీక్షను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వీకే ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 2వ తేదీ నుంచి కళాశాలలో 2025 పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. శిక్షణ పూర్తయిందని, 212 మంది విద్యార్థులు శిక్షణ పొందారన్నారు. వీరికి నమూనా పరీక్ష నిర్వహించగా బి.భావనదుర్గ, పి.హేమలత, లతీఫున్నీసాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. వీరికి బహుమతులను కళాశాల చైర్మన్ గుడివాడ ప్రసాద్, కార్యదర్శి తాడేపల్లి మెహర్ బాబా, కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు, డైరెక్టర్లు దోసపాటి బాబా, తమ్మన సాయి తదితరులు అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 30న జరిగే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు.

పేద విద్యార్థిని ఉన్నత విద్యకు ఆర్థిక సాయం



విద్యార్థిని మహాలక్ష్మికి ఆర్థిక సహాయ చెక్‌ను అందజేస్తున్న మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన ఓ పేద విద్యార్థినికి సోమవారం రూ. 28,500 ఆర్థిక సాయంను ఆ సంస్థ ప్రతినిధులు అందించారు. స్థానిక భాస్కరపురానికి చెందిన నాంపల్లి విజయ్ కుమార్, వాహిని దంపతుల కుమార్తె మహాలక్ష్మి ఇటీవల వెలువడిన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో 950 మార్కులు సాధించింది. చార్టెడ్ అకౌంటెంట్ చదవాలనే తన కలను నిజం చేసుకొనుటకు గాను ఆర్థిక సాయం చేసే దాతల కోసం ఎదురుచూస్తూ మైత్రీ ఫౌండేషన్ గౌరవ సభ్యులు చదలవాడ దివాకర్‌ను సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి మహాలక్ష్మి గుంటూరు మాస్టర్ మైండ్స్ అకాడమీలో చేరి చదువుకునేందుకు ఆర్థిక సాయం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయమని కోరారు. దీంతో ఫౌండేషన్ సభ్యులు సోమవారం ఆమెకు చెక్ అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లితండ్రులు దాత చదలవాడ దివాకర్‌కు, మైత్రి ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఓ వేణుకుమార్, గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రిలాక్స్ ప్రసాద్, సెక్రెటరీ రాధాకృష్ణ, జాయింట్ సెక్రెటరీ దీప్తి, ట్రెజరర్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న దృశ్యం



సర్పంచ్ చేతుల మీదుగా గ్రంథాలయ అధికారికి క్యారమ్ బోర్డు అందజేస్తున్న దాత విష్ణు



ఘంటసాల గ్రంథాలయంలో కథలు చదువుతున్న విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థుల కోసం వేసవి విజ్ఞాన శిబిరాలను సోమవారం ప్రారంభించారు. పోర్టు రోడ్డులో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన ఈ శిబిరానికి 35 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన రిటైర్డ్ ఎంఈఓ కె.రాజేంద్రప్రసాద్ విద్యార్థులకు నీతి కథలు, కవితలు, పద్యాలు నేర్పించారు. ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ వేసవి విజ్ఞాన శిబిరాల ఉపయోగం, గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. లైబ్రేరియన్ వై.జయలక్ష్మి విద్యార్థులకు కథలు చెప్పటంతో పాటు చదివించారు. అలాగే డ్రాయింగ్ వేయించి చెస్, క్యారమ్స్ ఆడించారు. యోగా చేయించారు. నగరంలోని చింతగుంటపాలెం, హౌసింగ్‌బోర్డు కాలనీల్లోని శాఖా గ్రంథాలయాల్లోనూ వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కేఆర్‌కే గాంధీ విచ్చేసి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాలను లైబ్రేరియన్‌లు నాగరవి, విజయలక్ష్మి పర్యవేక్షించారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగించుకోండి

గూడూరు: కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని సర్పంచ్ లింగం సులోచనారాణి కోరారు. గూడూరు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగించుకోవడానికి చిన్నారులకు ఇదో మంచి అవకాశం అన్నారు. విద్యార్థులు ఆడుకోవడానికి కారమ్‌బోర్డ్, చెస్, లూడో బోర్డులను గ్రామానికి చెందిన దాత కె.విష్ణు సర్పంచ్ చేతుల మీదుగా గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు లింగం విజయ్‌కుమార్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వేసవి శిక్షణ తరగతులు

ఘంటసాల: వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఘంటసాల, కొడాలి గ్రంథాలయ అధికారులు శరత్ కుమార్, సుబ్బారావు తెలిపారు. మండలంలోని ఘంటసాల, కొడాలి గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం చేశారు. అనంతరం లూడో, క్యారమ్స్ ఆటలు ఆడించారు.

అబాకస్‌లో బందరు విద్యార్థుల ప్రతిభ

మచిలీపట్నంఅర్బన్: జాతీయ స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లో తమ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు మచిలీపట్నం రాజా ఎడ్యుకేషనల్ అకాడమీ నిర్వాహకురాలు పి.లలితకుమారి సోమవారం తెలిపారు. విజయవాడ శ్రీ పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలు జరిగాయన్నారు. సీనియర్ 10 లెవెల్స్, జూనియర్స్ 6 లెవెల్స్ విభాగాలు పూర్తి చేసి అవార్డులు సాధించారన్నారు. విజేతలకు ఇస్రో రీసెర్చ్ సైంటిస్ట్ ఏడుకొండలు చేతుల మీదుగా అవార్డులు అందజేసినట్లు తెలిపారు. తమ సంస్థ ద్వారా 15 సంవత్సరాలుగా అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లలో శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు.